సాక్షి
పెద్దపల్లి

ఆదివారం, 13, ఆగస్టు, 2023

ఖాళీ స్థలాలు.. దోమలకు నిలయాలు



సుల్తానాబాద్‌లోని స్వప్న కాలనీలోని ఓ ఖాళీ స్థలంలో మురికినీరు

నీరు నిల్వ లేకుండా చూడాలి



ఖాళీ ప్లాట్లలో నీరు నిల్వ ఉండకుండా మున్సిపాలిటీ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. ఇప్పటికే పలువురు విషజ్వరాల బారిన పడ్డారు. సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలి. – గరిగే శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, సుల్తానాబాద్

శుభ్రం చేయిస్తున్నం..



సుల్తానాబాద్ మున్సిపల్ నూతనంగా ఏర్పడింది. పట్టణ ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన లేదు. ఖాళీ ప్లాట్లలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి. ఆ బాధ్యత యజమానులదే. అయినా మున్సిపల్ సిబ్బంది, కార్మికులతో ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. కొందరికి నోటీసులు జారీ చేశాం.

– ముత్యం సునీత, మున్సిపల్ చైర్ పర్సన్

బల్దియాలో 15 వార్డులు

సుల్తానాబాద్ బల్దియాలో 15 వార్డులు ఉనాయి. మొత్తం 30వేల వరకు జనాభా ఉంటుంది. ఇందులో స్వప్నకాలనీ, పూసాల రోడ్డు, జవహర్‌నగర్, గడిమెహర్, సుభాష్ నగర్, మార్కండేయ కాలనీ, ఎస్సారెస్పీ ఏరియా, గాంధీనగర్‌తో పాటు పలు ప్రాంతాలు మున్సిపాలిటీ పరిధిలోకి రావడంతో ఆయా ప్రాంతాల్లో ప్లాట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయితే ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా చుట్టుపక్కల ఇళ్లలోకి విషపురుగులు వస్తున్నాయి. ఇంటికొకరు చొప్పున జ్వరంబారిన పడుతున్నారు. నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని ప్లాట్ల చుట్టుపక్కల ఇళ్ల యజమానులు కోరుతున్నారు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ స్థలాలు దోమలకు నిలయంగా మారుతున్నాయి. కొందరు ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి వాటిని నిరుపయోగంగా వదిలేశారు. దీంతో ఆ ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరగడంతోపాటు వర్షాలు కురిసినప్పుడు మురుగునీరు అందులో చేరుతోంది. ఫలితంగా పారిశుధ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. విష పురుగులు, దోమల బెడద కూడా ఎక్కువవుతోంది. క్రమంగా మురుగునీరు దుర్వాసన వెదజల్లుతూ అనారోగ్యంబారిన పడేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమలు కాని నిబంధనలు

పట్టణంలో 650 వరకు ఖాళీ ప్లాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన నూతన పురపాలక చట్టం–2019 ప్రకారం ఖాళీ స్థలాలు కల్గిన యజమానులకు పురపాలకశాఖ అధికారులు పన్ను విధించడంతోపాటు ఆ స్థలాలను అపరిశుభ్రంగా వదిలేస్తే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకునే అధికారం ఉంది. కానీ కొన్నిచోట్ల పురపాలక అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. పట్టణాల్లో పలువురు ఖాళీ స్థలాల్లో నివాసాలు నిర్మించకుండా వదిలేశారు. పురపాలక పరిధిలో ఖాళీ స్థలాలు కలిగిన యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేయడంతో కొందరు ప్లాట్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేసి పిచ్చి మొక్కలు పెరగకుండా, వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

న్యూస్‌రీల్

శ్రీఆదివరాహస్వామికి భక్తుల పూజలు



ఆదివరాహస్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

కమాన్‌పూర్: మండలకేంద్రంలోని శ్రీఆదిరాహస్వామి సన్నిధికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకున్నారు. పలువురు అన్నదానం చేశారు.

క్రమబద్ధీకరించేవరకూ పోరాటం



ఆందోళన చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

పెద్దపల్లిరూరల్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చుకునే వరకూ పోరాటం చేస్తామని సెకండ్ ఏఎన్ఎంలు స్పష్టం చేశారు. ఏఐటీయూసీ నాయకుడు సునిల్, సీపీఐ కార్యదర్శి సదానందం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట వంటావార్పు నిర్వహించి.. సహపంక్తి భోజనాలు చేశారు. న్యాయమైన సమస్యల పరిష్కారానికి నిరసన వ్యక్తం చేస్తున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఈనెల 15న నల్లజెండాలతో నిరసన తెలిపి 16నుంచి సమ్మెకు దిగుతామని సెకండ్ ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వరూప తెలిపారు. నాయకులు సునీత, రాణి, రాజేశ్వరి, నిర్మల, రమ, అరుణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే అంటువ్యాధులు దూరం

ఓదెల: పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులు దూరమవుతాయని డీపీవో చంద్రమౌళి అన్నారు. మండలంలోని హరిపురం, ఉప్పరపల్లె, కొమిర, జీలకుంట, గూడెం, బీమరిపల్లె గ్రామాల్లో సందర్శించారు. వర్షాలకు చెత్తచెదారంతో నిండిపోయిన మురికికాలువలను శుభ్రం చేయాలని, మంచినీటి బావుల్లో క్లోరినేషన్ చేయించాలని సూచించారు. వర్మీకంపోస్టు, తడిచెత్త పొడిచెత్త వాడకాలపై అడిగి తెల్సుకున్నారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ వాయుకుమార్, ఎంపీవో వాజీద్, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, శ్రీకాంత్, కిరణ్, మాదాసి ప్రసాద్, మల్యాల రమేశ్, సామ దిలీప్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకల ముఖ్య అతిథిగా భానుప్రసాద్



పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఈనెల 15న నిర్వహించే స్వాతంత్య్ర వేడుకలకు ముఖ్య అతిథిగా శాసన మండలి చీఫ్‌విప్ తానిపర్తి భానుప్రసాద్ హాజరవుతారు. పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించి జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

'అందరిలా ఆస్తులు కూడబెట్టుకోలే..'



మాట్లాడుతున్న సోమారపు సత్యనారాయణ

గోదావరిఖని: తాను ఎమ్మెల్యే అయ్యాక తన ఆస్తులు తరిగాయే తప్ప పెరగలేదని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు సోమారపు సత్యనారాయణ అన్నారు. శనివారం ఆర్జీ–2 పరిధిలోని ఓసీపీ–3, ఏరియా వర్క్‌షాప్‌లో వేర్వేరు గేట్ మీటింగ్‌లలో మాట్లాడారు. ప్రతి కార్మికుడినీ కలుసుకుని, వారి బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రాజకీయంలో కష్టార్జితాన్ని నమ్ముకుని ముందుకు సాగానని, తాను అక్రమంగా ఆస్తులు కూడబెట్టలేదని తెలిపారు. రామగుండం మున్సిపల్ చైర్మన్‌గా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీవరేజీ సిస్టం, అన్ని ఏరియాలలో రోడ్లు వేయించానని, 24 గంటలూ నల్లాల ద్వారా తాగునీటిని సరఫరా చేయించానని గుర్తు చేశారు. అప్పుడు తన పనితీరు నచ్చి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించారని పేర్కొన్నారు. ఇప్పటివరకు తాను భూకబ్జాలు, సెటిల్మెంట్లు, పోలీస్ పైరవీలు, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగాలు, సింగరేణి ఓబీ కాంట్రాక్టు ఉద్యోగాలు, మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగాలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరిట ప్రజల రక్తాన్ని పీల్చలేదని, అది తనకు రాని పని అని తెలిపారు. ఇప్పుడున్న కొందరు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసం చేస్తున్నారని, వారి మాయలో పడి భూములు, ఇళ్లు, భార్యపై ఉన్న పుస్తెలు అమ్మి ఉద్యోగాల పేరిట పెట్టి మోసపోతున్నారని తెలిపారు. గేట్‌మీటింగ్‌లో నాయకులు పిడుగు క్రిష్ణ, సోమారపు అరుణ్‌కుమార్, కార్పొరేటర్ మండల కిషన్‌రెడ్డి, దుబాసి లలిత, కోదాటి ప్రవీణ్, దీటి వెంకటస్వామి, దాసరి శ్రీనివాస్, బద్రి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది ఐదురోజులే

- లిక్కర్‌షాపుల టెండర్లకు అనాసక్తి
- గతంతో పోల్చితే భారీగా తగ్గిన దరఖాస్తులు
- వేచిచూసే ధోరణిలో వ్యాపారులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మద్యం షాపుల టెండర్ల దరఖాస్తులు మందకొడిగా సాగుతున్నాయి. 2023–25 ఆర్థిక సంవత్సరానికి మద్యం షాపుల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఈనెల 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ ఎక్సైజ్‌శాఖ చేపట్టింది. ఈనెల 18నాటికి వరకు చివరి తేదీ. ఈ సారి రెండు వారాల గడువు ఇవ్వడంతో ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల సంఖ్య తగ్గింది. చాలా మంది మద్యం వ్యాపారులు వేచి చూసే ధోరణిలో ఉన్నట్లుగా తెలుస్తోంది. దరఖాస్తుల సంఖ్య పెంచేలా ఎక్సైజ్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

తగ్గిన దరఖాస్తులు..

ఉమ్మడి జిల్లాలో జగిత్యాలలో 71షాపులకు ఇప్పటి వరకు 210 దరఖాస్తులు వచ్చాయి. కరీంనగర్ జిల్లాలో 94 షాపులకు గాను 385, పెద్దపల్లిలో 77 షాపులకు 121 దరఖాస్తులు, సిరిసిల్లలో 48షాపులకు గాను 439 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 18వరకు గడువు ఉండటంతో చాలామంది వ్యాపారులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. చివరి తేదీనాటికి ఆయా షాపులకు వచ్చిన దరఖాస్తులు, డిమాండ్ ఉన్నషాపులను దృష్టిలో ఉంచుకుని టెండర్‌లో పాల్గొనాలని చూస్తున్నారు. అయితే చివరిరోజు 60 నుంచి 70శాతం దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు.

డిమాండ్ ఉన్న షాపులపై నజర్

చాలా మంది మద్యం వ్యాపారులు డిమాండ్ ఉన్న షాపులపై దృష్టి సారించారు. ఇంకో ఐదురోజుల సమయం ఉండటంతో డిమాండ్ ఉన్న షాపుల్లో ఎక్కువ దరఖాస్తులు వేటికి వచ్చాయి..? ఏఏ షాపులకు దరఖాస్తు చేయాలనే అంశాలపై దృష్టి పెట్టారు. ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్లలో అత్యధికంగా 439 దరఖాస్తులు వచ్చాయి.

ఉమ్మడి జిల్లాలో మద్యం షాపుల దరఖాస్తులు (శుక్రవారం నాటికి)

జిల్లా	దరఖాస్తులు	షాపులు
జగిత్యాల	210	71
కరీంనగర్	385	94
పెద్దపల్లి	121	77
సిరిసిల్ల	439	48

అన్నకు తమ్ముడి కిడ్నీ



సిరిసిల్ల: తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన పబ్బతి విజయేందర్‌రెడ్డి(53) రైతు. షటిల్ ఆడేవాడు. ఉన్నట్టుండి వాంతులయ్యాయి. ఆస్పత్రికి వెళ్లగా కిడ్నీలు ఫెయిలయ్యాయని వైద్యులు నిర్ధారించారు. డయాలసిస్‌కు నెలకు రూ.40వేల నుంచి రూ.60వేల వరకు ఖర్చయ్యాయి. మూడు నెలలు గడిచాయి. విజయేందర్‌రెడ్డిని ఆస్పత్రిలో ఆ స్థితిలో చూసిన అతని తమ్ముడు జితేందర్‌రెడ్డి(50) తన రెండు కిడ్నీల్లో ఒకటి ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. హైదరాబాద్ ఆస్పత్రిలో ఆపరేషన్ అయింది. మృత్యువు ముంగిట అసహాయంగా నిల్చున్న అన్నకు ఆత్మీయ రక్తబంధం పునర్జన్మనిచ్చింది. విజయేందర్‌రెడ్డి ప్రస్తుతం జిల్లెల్లలో వ్యవసాయం, తమ్ముడు జితేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు.

తొలి డోనర్ లక్ష్మి



ఇప్పనపెల్లి లక్ష్మి(ఫైల్)

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలోని గాంధీనగర్‌కు చెందిన ఇప్పనపల్లి నారాయణ, లక్ష్మి దంపతులు. మిర్చి బండి పెట్టుకుని జీవించేవారు. 12 ఏళ్లక్రితం పనులు ముగించుకుని ఇంటికెళ్లారు. అర్ధరాత్రి దాటాక విపరీతమైన తలనొప్పితో లక్ష్మి కింద పడిపోయింది. ఆమెను హైదరాబాద్‌లోని కిమ్స్‌లో చేర్పించారు. ఆమె బ్రెయిన్‌డెడ్ కావడంతో అవయవదానంపై అవగాహన కల్పించారు. ఆమె కుమారులు సంతోష్, రమేశ్ అంగీకారం మేరకు లక్ష్మి ఊపిరితిత్తులు, కాలేయం, గుండె, మూత్రపిండాలు సేకరించి నలుగురు వ్యక్తులకు అమర్చారు. జిల్లాలోనే తొలి అవయవ దాతగా లక్ష్మి గుర్తింపుపొందారు.

తండ్రి.. భార్య ఇద్దరూ దాతలే




కోరుట్ల: తండ్రి.. భార్య ఇద్దరూ కిడ్నీ దాతలుగా నిలిచారు. కోరుట్లకు చెందిన గీత కార్మికుడు పోతుగంటి శ్రీనివాస్ 2017లో వెన్నునొప్పితో అవస్థ పడడంతో తండ్రి రఘుగౌడ్ వైద్యులతో పరీక్షలు చేయించాడు. శ్రీనివాస్‌కు కిడ్నీ సమస్య ఉందని తేలడంతో కలవరపడ్డాడు. వైద్యులు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయకతప్పదని చెప్పడంతో రఘుగౌడ్ తన కిడ్నీదానం చేశాడు. శ్రీనివాస్ ఆరోగ్యం కుదుటపడింది. ఐదేళ్ల తరువాత 2022లో మళ్లీ వెన్నునొప్పి మొదలైంది. మరోసారి పరీక్షించిన వైద్యులు మళ్లీ కిడ్నీ మార్పిడి చేయాల్సిందేనని చెప్పడంతో అతడి భార్య లావణ్య కిడ్నీ ఇచ్చింది. శ్రీనివాస్ తేరుకుని ప్రస్తుతం ఏ సమస్య లేకుండా తన పనులు తాను చేసుకుంటున్నాడు.

మరణించి.. జీవించి..

- అవయవదానానికి ముందుకొస్తున్న కుటుంబాలు
- ఉమ్మడి జిల్లా ప్రజల్లో పెరుగుతున్న అవగాహన
- నేడు ప్రపంచ అవయవ దాన దినోత్సవం

మనిషికి ఒకటే జన్మ.. అదే మనిషి అవయవాలకు మాత్రం రెండు జన్మలు. అవయవదానం చేస్తే మరణించినా మరోసారి జీవించే అవకాశం ఉంది. ఒక్క మనిషి చనిపోతే గుండె, మూత్రపిండాలు, ప్యాంక్రియాస్, ఊపిరితిత్తులు, కాలేయం, పేగులు, చేతులు, ముఖం, కణజాలం, ఎముకమజ్జ, మూలకణాలు దానం చేసి మరో 8 మంది ప్రాణాలు కాపాడొచ్చు. దేశంలో మరణాల సంఖ్య అధికంగా ఉన్నా.. అవయవదాతలు ఆ స్థాయిలో ఉండడం లేదు. చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులు, బంధువుల ఆలోచనలు, ఆచారాలు, కట్టుబాట్లు, అవగాహన రాహిత్యంతో చాలామంది ముందుకు రావడం లేదు. 18ఏళ్లు దాటినవారు ఆర్గాన్స్ డొనేట్ చేయొచ్చు. నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రాణం పోసిన.. దాతల సహకారంతో బతుకుతున్న వారిపై..

ఈ వారం సండే స్పెషల్..



సండే స్పెషల్



అవయవదాతల 'అబ్బిడిపల్లె'



ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు(ఫైల్)

ఓదెల: పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం అబ్బిడిపల్లె వాసులు మూకుమ్మడిగా అవయవదానానికి అంగీకరిస్తూ తీర్మానం చేశారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అప్పటి కలెక్టర్ సంగీతకు లేఖ అప్పగించారు. అబ్బిడిపల్లెలో 600 జనాభా ఉంటుంది. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు భీష్మాచారి ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కల్పించగా.. సర్పంచ్ ఒజ్జ కోమలత ఆధ్వర్యంలో తీర్మానం చేసి శభాష్ అనిపించుకున్నారు.

మెడికల్ కాలేజీకి మృతదేహం



మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న కుటుంబసభ్యులు, సదాశయ ప్రతినిధులు(ఫైల్)

కోల్‌సిటీ: గోదావరిఖని శివాజీనగర్‌కు చెందిన దేవకి పార్థసారథి (85) తన మరణానంతరం అవయవాలు దానం చేస్తానని సదాశయ ఫౌండేషన్‌కు అంగీకార పత్రం రాసిచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న అనారోగ్యంతో మృతి చెందగా.. కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను ఐ బ్యాంక్‌కు, పార్థివదేహాన్ని రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అప్పగించారు.

ఏడుగురికి పునర్జన్మ



ఇమానుయేల్(ఫైల్)

కోల్‌సిటీ: తాను మరణించి మరో ఏడుగురికి పునర్జన్మిచ్చారు గోదారిఖనిలోని విద్యానగర్‌కు చెందిన సిరిసిల్ల ఇమానుయేల్(33). హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేసే ఆయన 2019 జనవరి 3న బైక్‌పై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వారంపాటు మృత్యువుతో పోరాడి కన్నుమూశాడు. ఆయన కుటుంబసభ్యులు ఆయన అవయవాలను దానం చేయగా.. ఏడుగురికి పునర్జన్మ లభించింది.

నలుగురికి ప్రాణం



కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ఎల్బీనగర్‌కు చెందిన మింగాని సంపత్(41) ఎమ్మెస్సీ, బీఈడీ చదివారు. ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ డైరెక్టర్. 2019 జనవరి 14న రోడ్డు ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లి మరణించారు. నలుగురికి లివర్, రెండు కిడ్నీలు, గుండె అమర్చారు.

బతికుండగానే..



సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయికి చెందిన పానగంటి స్వప్న(45) అంగన్‌వాడీ టీచర్. తాను చనిపోయాక తన అవయవాలు దానం చేయాలని భర్త నర్సయ్యతో చెబుతుండేది. తీవ్ర జ్వరంబారిన పడి చనిపోయిన ఆమె కోరిక మేరకు ఆమె రెండు కిడ్నీలు, గుండెను దానం చేశారు కుటుంబసభ్యులు.


దేహదానానికి నిర్ణయం



లింగమూర్తి, విజయ

కోల్‌సిటీ: గోదావరిఖని చంద్రబాబుకాలనీలో నివాసం ఉంటున్న మేరుగు లింగమూర్తి ఓసీపీ–3లోని బేస్ వర్క్‌షాప్‌లో ఆపరేటర్. ఎనిదేళ్ల క్రితం రెండు కిడ్నీలు చెడిపోయాయి. డయాలసిస్‌పై ఉన్న భర్త లింగమూర్తిని బతికించుకోవడానికి అతని భార్య విజయ తన కిడ్నీని దానంచేసింది. ఇప్పుడు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. ఇదే స్ఫూర్తితో తమ మరణానంతరం తమ దేహాలను మెడికల్ కాలేజీకి దానం చేస్తామని సదాశయ ఫౌండేషన్‌కు అంగీకార పత్రాలు రాసి ఇచ్చారు.


కొడుకు కళ్లు సజీవం..



కోల్‌సిటీ: నా కొడుకు విజయ్‌పాల్‌రెడ్డి 2018 సెప్టెంబర్ 27న చనిపోయాడు. నేను, భార్య సుశీలతోపాటు నా కుటుంబ సభ్యులు దుఃఖంలో కూడా విజయపాల్‌రెడ్డి నేత్రాలను ఐ బ్యాంక్‌కు దానం చేశాం. నా భార్య, నేను కూడా మా మరణానంతరం నేత్రదానం చేస్తామని అంగీకారం తెలిపాం. చనిపోయిన వారి అవయవాలు మరికొందరికి ఉపయోగకరంగా ఉంటాయి. వారిలో మనవారిని చూసుకోవచ్చు.

– మారెల్లి రాజిరెడ్డి, యైటింక్లయిన్‌కాలనీ, గోదావరిఖని


తమ్ముడు తోడుండాలని..



కోరుట్లరూరల్: మాది మండలంలోని సంగెం. నాకు ఒక అన్న, ఇద్దరు తమ్ముళ్లు. చిన్న తమ్ముడు చీటి రాంచందర్‌రావుకు 18ఏళ్ల క్రితం అనారోగ్యంతో రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి. డయాలసిస్ చేసినా ప్రయోజనం లేదని డాక్టర్లు చెప్పారు. తమ్ముడిని కాపాడుకునేందుకు ఒక కిడ్నీ ఇచ్చా. కొంతకాలానికి తమ్ముడు అనారోగ్యంతో చనిపోయాడు. కిడ్నీ ఇచ్చిన నేను ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నా. అన్ని పనులు చేసుకుంటున్నా. తమ్ముడే దక్కలేదు.

– చీటి మురళీధర్ రావు, సంగెం, కోరుట్ల


రాష్ట్రం మొదటిస్థానం



కోల్‌సిటీ: అవయవదానంపై ప్రజల్లో చైతన్యం వచ్చింది. మన రాష్ట్రం దేశంలో అవయవదానంలో మొదటిస్థానంలో నిలిచింది. గోదావరిఖని ప్రాంతంలో ఎక్కువ మంది ముందకు వస్తున్నారు. 2008లో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పురుడుపోసుకున్న సదాశయ ఫౌండేషన్.. రాష్ట్రవ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అవయవదాతల కుటుంబాలకు, స్వచ్ఛంద సంస్థలకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

– టి.శ్రవణ్‌కుమార్, సదాశయ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు

మా ఆయన్ను దక్కించుకోవాలని..



విద్యానగర్(కరీంనగర్): మా వారు వారాల ఆనంద్. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. 2013లో ఆయనకు రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి. వారానికి మూడు సార్లు డయాలసిస్ ఏడాదిపాటు చేయించుకోవాల్సి వచ్చింది. ఆయన్ను దక్కించుకునేందుకు నేను ఒక కిడ్నీ ఇచ్చేందుకు సిద్ధమయ్యా. నా కిడ్నీని ఆనంద్‌కు 15 జూలై 2014లో ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. నా జీవితంలో ఆయన లేని లోటును ఊహించలేను. నాలో భాగమైన ఒక కిడ్నీ ఇచ్చి బతికించుకున్నాను. ఇప్పుడు నేను, మావారు పిల్లలతో ఆనందంగా ఉన్నాం.

– వారాల ఇందిరారాణి, గృహిణి, కరీంనగర్

కొడుకు ప్రాణం పోశాడు



వేములవాడ: మాది వేములవాడ. కొన్నేళ్లక్రితం లివర్‌వ్యాధి ఉండేది. ఆపరేషన్ చేసినా ఫలితం లేకపోయింది. నా కొడుకు మారుతి లివర్ నాకు సరిపోయింది. 17 నవంబర్ 2017న మారుతి లివర్‌లోని కొంత భాగాన్ని నా లివర్‌కు జతచేశారు. ఇప్పుడు ఇద్దరం ఆరోగ్యంగా ఉన్నాం. నా కొడుకు లివర్ ఇచ్చి నాకు ప్రాణం పోశాడు.

– కుమ్మరి శంకర్, వేములవాడ

పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో నేత్ర, అవయవ, దేహదానం వివరాలు

నేత్రదానం	850 మంది(సుమారు 1,700 మందికి కంటి చూపు వచ్చింది)
అవయవదానం	80 మంది(సుమారు 300 మందికి పైగా పునర్జన్మ)
మెడికల్ కళాశాలలకు దేహదానం	90 మంది
అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు	950
అంగీకారం తెలిపిన వారు	50వేలకుపైగా..

అవయవదానంపై సేవలందిస్తున్న ప్రతినిధులు

టి.శ్రవణ్‌కుమార్	9948609591
సీహెచ్.లింగమూర్తి	9492781306
మేరుగు భీష్మాచారి	9849590415
బేణిగోపాల్ త్రివేది	9848218989
కె.శ్రీనివాస్	9849737100

క్లుప్తంగా

నియామకం


మహేందర్

జ్యోతినగర్: జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడిగా మోకిరాల మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా టీఎన్జీవో అధ్యక్షుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రామగుండం మండల వ్యవసాయ విస్తరణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మహేందర్‌ను నియమించడంపై పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎర్ర రాజు, గౌరవాధ్యక్షుడిగా యాదగిరి శ్రీనివాస్, కోశాధికారిగా బాలూరి శశిధర్‌ను ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ నాన్ గెజిటెడ్ ఎంప్లాయీస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరు శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు సుధీర్ కుమార్, మహేందర్, పెద్దపల్లి అర్బన్ యూనిట్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్, మురళీకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

శిశువు మృతిపై విచారణ


విచారణ చేస్తున్న డీసీహెచ్ శ్రీధర్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రిలో శిశువు మృతి చెందడంపై డీసీహెచ్ శ్రీధర్ విచారణ చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తన కుమారుడు మృతిచెందాడని శిశువు తండ్రి అలీముద్దీన్ ఈనెల 7న ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో డీసీహెచ్ శ్రీధర్ ఆస్పత్రిలో శనివారం విచారణ చేపట్టారు. సుల్తానాబాద్‌కు చెందిన నేహాముస్కాన్ మొదటి కాన్పు కోసం కోసం ఈనెల ఒకటిన ఆసుపత్రిలో చేరింది. ఈనెల మూడున వైద్యులు బాబుకు పురుడుపోశారు. అయితే ఆమెకు నొప్పులు సక్రమంగా రాలేదని, కడుపులోనే శిశువు ఉమ్మనీరు మింగిందని, అయినా ప్రసవం చేసి.. బాబు ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు కరీంనగర్‌లోని ఎంసీహెచ్‌కు సిఫార్సు చేశామని వైద్యులు తెలిపారు. కానీ బాబు ఈనెల5న మృతి చెందడంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. సాధారణ ప్రసవం కోసం వేచిచూశారని, సిబ్బందిపై సరైన పర్యవేక్షణ చేయలేదని పేర్కొన్నారు. ఈ మేరకు డీసీహెచ్ ఆ రోజు విధుల్లో ఉన్న డాక్టర్, స్టాఫ్ వివరాలు సేకరించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రమాదేవి విచారణ చేసి శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేస్తారని తెలిపారు.

సకాలంలో వైద్యం అందకనే..

బాధితురాలి తల్లి ఫాతిమా మాట్లాడుతూ సిబ్బంది నిర్లక్ష్యంతోనే శిశువు రెండురోజుల అనంతరం కరీంనగర్ మాతాశిశు ఆసుపత్రిలో చనిపోయాడని, సకాలంలో వైద్యం అందకపోవడంతోనే బాబు చనిపోయినట్లు మాతాశిశు ఆసుపత్రి డాక్టర్లు తెలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. సుల్తానాబాద్ ఆసుపత్రిలో నైట్‌డ్యూటీ డాక్టర్, సిబ్బందిని నాలుగైదు సార్లు నిద్ర లేపితే తప్ప వైద్యం అందించలేదని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉమ్మనీరు లేక ఇబ్బంది పడుతున్న దృష్ట్యా సర్జరీ చేయాలని ఎంత బతిమిలాడినా సిబ్బంది నిర్లక్ష్యం చేశారని తెలిపారు. నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని డీసీహెచ్ తెలిపారు.

భళా.. త్రీడీ కళ

- ఎల్లలు దాటిన మంథని యువకుడి ప్రతిభ
- మన దేశం నుంచి ఎస్‌ఎస్‌ఆర్ కృష్ణ
- నలభై మంది అంతర్జాతీయ ఆర్టిస్టుల్లో కేవలం ఇద్దరే
- ప్రపంచ రికార్డుల్లో ప్రాతినిధ్యం

మంథని: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన శివరామకృష్ణ త్రీడీ పెయింటింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. తాజాగా అమెరికాలోని డౌన్‌టౌన్ మిన్నియా పాలిస్ నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్ట్రీట్ ఆర్ట్ ఫెస్టివల్ ఆహ్వానం మేరకు అక్కడి త్రీడీ ఆర్టిస్టు షాన్‌తో కలిసి వేర్ హౌస్ డిస్ట్రిక్ట్ లైవ్ ఈవెంట్‌కు అనుగుణంగా త్రీడీ ఆర్ట్ వేసి ప్రశంసలు అందుకుంటున్నాడు.

అబ్బురపరిచేలా త్రీడీ చిత్రాలు

త్రీడీ పెయింటింగ్ వేయడంలో శివరామకృష్ణ సిద్ధహస్తుడయ్యాడు. రోడ్డుపై త్రీడీ జిబ్రా క్రాసింగ్ లైన్లు ఉన్నట్లు కనిపించేలా ఔరా అనిపిస్తున్నాడు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో శివ గీసిన చిత్రాలకు గుర్తింపు వచ్చింది. ప్రస్తుతం మంథని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర వెయ్యి కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా వేసిన చిత్రాలకు ప్రశంసలు లభించాయి. అక్కడి అభిమానులు శివరామకృష్ణతో త్రీడీ పెయింటింగ్ వేయించి రాహుల్‌కు స్వాగతం పలికారు. కాగా రాహుల్ కూడా శివరామకృష్ణను అభినందించారు. సొంతంగా త్రీడీ ఆర్ట్ నేర్చుకున్న శివ ఎన్నో ఇబ్బందులు, ఆర్థిక సమస్యలు ఎదురైనా కళను మర్చిపోలేదు. తాను వేసిన త్రీడీ చిత్రాలు ఫెనమైజ అనే టట్రీ మ్యాగజైన్‌లో దాదాపు నాలుగు సంవత్సరాల పాటు పబ్లిష్ అయ్యాయి. హర్యానాకు చెందిన త్రీడీ ఆర్టిస్ట్ ముఖేశ్ సలహా మేరకు కృష్ణ పెయింటింగ్ వేయడం నేర్చుకున్నాడు.


అమెరికాలో శివరామకృష్ణ వేసిన త్రీడీ చిత్రం

గొప్ప అనుభూతి



అమెరికాలో త్రీడీ అర్ట్ వేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. అంతర్జాతీయ స్థాయిలో త్రీడీ ఆర్టిస్టులు ఇద్దరమే ఉన్నాం. అమెరికాకు చెందిన షాన్ కాగా రెండో ఆర్టిస్ట్ నేనే కావడం ఆనందంగా ఉంది.

– శివరామకృష్ణ, త్రీడీ ఆర్టిస్ట్, మంథని


శివ రామకృష్ణ త్రీడీ పెయింటింగ్

దేశంలోనే తొలి త్రీడీ పుస్తకం

త్రీడీ చిత్రకళలో గుర్తింపు పొందిన శివ దేశంలోనే తొలి త్రీడీ పుస్తకం రాసి తన కళకు మరింత వన్నె తెచ్చాడు. దేశంలోనే మంచి ప్రచురణ కర్తగా పేరున్న నోషన్ ప్రెస్ పుస్తకాన్ని ప్రచురించింది. త్రీడీ డ్రాయింగ్‌తో పాటు జీవన నైపుణ్యాలపై రెండు పుస్తకాలు రాశారు. తనను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులు సింగారపు పోచమ్మ–కిష్టయ్యకు పుస్తకాన్ని అంకితమిచ్చారు.

ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలి

యైటింక్లయిన్ కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న దాదాపు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు జాతీయ పండుగ సెలవులు ప్రకటించి ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కోరారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సివిక్, హౌస్‌కీపింగ్, తోటమాలి కార్మికులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు మూడేళ్ల నుంచి రావాల్సిన సీఎంపీఎఫ్ చిట్టీలను సింగరేణి యాజమాన్యం పంపిణీ చేయాలన్నారు. ఆర్జీ–2 ఏరియాలో వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న వారికి రెయిన్ కోట్లతో పాటు రక్షణ పరికరాలు అందించాలన్నారు. లేకపోతే కార్మికులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో పద్మ, నిర్మల, మల్లయ్య, సమ్మయ్య, దుర్గేశ్, ప్రేమ్‌కుమార్, శంకర్, మల్లేశ్, సమ్మక్క, వెంకటలక్ష్మి, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అశోక్

మహిళా కార్మికులతో బొగ్గు మోయిస్తోన్న యాజమాన్యం

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ఉన్నత చదువులు చదివిన మహిళా కార్మికులతో బొగ్గు మోపిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆరోపించారు. శనివారం దుర్గానగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు పొందిన మహిళా ఉద్యోగినుల పట్ల యాజమాన్యం కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయిస్తున్నారన్నారు. మహిళా ఉద్యోగులకు సముచిత స్థలాల్లో పని కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికుల సమస్యలపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో త్వరలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. వారసత్వ ఉద్యోగాల కల్పనపై తీరుపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్మికులకు అండగా కాంగ్రెస్..

సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల ఆశీర్వాద యాత్రలో భాగంగా జీడీకే–5 ఓసీపీ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, సోషల్ మీడియా వారియర్స్, తదితరులు పాల్గొన్నారు.


బొగ్గు ఎత్తుతున్న రాజ్‌ఠాగూర్

ధర్నాను విజయవంతం చేయాలి

రామగిరి: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 16న ఆర్జీ –3 జీఎం కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఆకుల వెంకన్న పిలుపునిచ్చారు. పెనాల్టీల పేరుతో కార్మికులను వేధించడం మానుకోవాలని, పలు డిమాండ్లతో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

రోడ్డు ఇలా.. విధులకు వెళ్లేదెలా


గుతలు గుంతలుగా జీడీకే-2ఏ మోరీ రోడ్డు

గోదావరిఖని: నిత్యం వందలాది మంది ప్రయాణించే జీడీకే–2ఏ మోరీ అస్తవ్యస్తంగా తయారైంది. భారీ వర్షాలకు ఇసుకమేటలు, డ్రైనేజీ వ్యర్థాలు రోడ్డుపై పేరుకుపోయి ప్రమాదకరంగా మారింది. సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకొని విధులకు వెళ్లే కార్మికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని బోయిన్‌పేటకు చెందిన తాత రాజ కొమురయ్య (49) గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. మృతుడి భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

కాల్వశ్రీరాంపూర్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం పోతన కాలనీ నుంచి కారు (టీఎస్ 26 జి 2287)లో జమ్మికుంట వైపు గంజాయిని తరలిస్తుండగా ఇప్పలపల్లెలో పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. కారుతో పాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేత

జ్యోతినగర్: రామగుండం ప్రభావిత, పునరావాస గ్రామాల యువతకు ఎన్టీపీసీ సంస్థ సహకారం అందిస్తుందని దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు డాక్టర్ చిన్మయి దాస్ అన్నారు. శనివారం రామగుండంలో సీఎస్సార్ సహకారంతో కంప్యూటర్ కోర్సులను పూర్తిచేసిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఐటీ హార్డ్‌వేర్, డీసీఏ, టాలీ కోర్సుల్లో వందమందికి శిక్షణ అందించినట్లు తెలి పా రు. ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్, దీప్తి మహిళా సమితి స భ్యురా ళ్లు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లి రూరల్: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఎస్సీ విద్యార్థులకు ఉన్నత చదువులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి నాగలేశ్వర్ తెలిపారు. ఆసక్తి, అర్హతగల ఎస్సీ విద్యార్థులు వివిధ దేశాలకు ఉన్నత చదువులకు వెళ్లొచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులు సెప్టెంబర్ 30లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.



పడిపోతే పరిస్థితి ఏమిటో..!?

పొలాల్లో వేసిన విద్యుత్ స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. అసలే వర్షాకాలం.. పంటలకు నీరు పెట్టేందుకు రైతులు బావుల వద్దకు వెళ్తుంటారు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైతే ఎవరిది బాధ్యత అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎలిగేడు మండలం లోకపేట, ముప్పిరితోట గ్రామాల శివారులో ఇలా వంగిన స్తంభాలు సాక్షి కెమెరాకు కనిపించాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

బొగ్గుబాయి

నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి

గోదావరిఖని: బొగ్గు రవాణాలో నిర్దేశిత లక్ష్యాలు సాధించాలని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు అన అన్నారు. ఓసీపీ–1 సీహెచ్‌పీలో జనవరిలో అత్యధిక బొగ్గు రవాణా చేసిన ఉద్యోగులకు శనివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ బొగ్గు రవాణాలో రికార్డు సాధించాలన్నారు. రక్షణతో కూడిన రవాణాకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, ఇంజినీర్ శ్రీనివాస్, డీజీఎం కాశీ విశ్వేశ్వర్ రావు, మేనేజర్ ఉదయ్ హరిజన్, సంక్షేమాధికారి సాయికృష్ణ, పిట్ సెక్రటరీ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న జీఎం సుధాకర్ రావు

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

- ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: మహిళలు స్వయం సమృద్ధిని సాధించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సింగరేణి సేవాభవన్‌లో ఉచిత ఉపాధి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా రాణించేందుకు టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు నేర్చుకోవాలన్నారు. కుట్లు, అల్లికలు, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్ కోర్సులకు డిమాండ్ ఉందని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, లేడీస్ క్లబ్ సెక్రటరీ చిలుక లక్ష్మి, సీనియర్ పీవో సారంగపాణి, సంక్షేమాధికారి జి.హనుమంత రావు, సేవా కో ఆర్డినేటర్ మేడి తిరుపతి, కమ్యూనికేషన్ సెల్ కో ఆర్డినేటర్ నగునూరి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్, తదితరులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఏఎల్‌పీ గనిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గని మేనేజర్ జనార్దన్‌కు ఏఐటీయూసీ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆర్జీ–3 ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎంఆర్‌సీ రెడ్డి మాట్లాడుతూ.. సంస్థలో ఎక్కడా లేని విధానాలను యాజమాన్యం ఏఎల్‌పీ గనిలో అనుసరించడం సరికాదన్నారు. ఆర్జీ– 3 పరిధిలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులకు సింగరేణి వ్యాప్తంగా అవకాశం కల్పించిన యాజమాన్యం నేడు ఆర్జీ –1 లో అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం ఏఎల్‌పీ గని కార్మికులకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌గా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కందుల సమ్మయ్య, జూపాక రాం చందర్, డీటీ రావు, రవికుమార్, కుమార్, మోహన్, సతీశ్, భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.


గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వకీల్‌పల్లి గని సందర్శన

గోదావరిఖని: రామగుండం డివిజన్–2 పరిధిలోని వకీల్‌పల్లి గనిని ఎన్టీపీసీ ఫ్యూయల్ డైరెక్టర్ శివం శ్రీవాత్సవ శనివారం సందర్శించారు. గనిలోని ఉత్పత్తి, ఉత్పాదకత తదితర విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం గనిలోకి వెళ్లి పనిస్థలాలను సందర్శించారు. ఆయన వెంట ఎస్‌ఓటూ డైరెక్టర్ కిరణ్ గోసాల, ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ రెడ్డి, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, అప్సర్‌పాషా, రహమద్ అలీ తదితరులున్నారు.


గనిని పరిశీలించేందుకు వెళ్తున్న ఎన్టీపీసీ డైరెక్టర్, అధికారులు

వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లించాలి

గోదారిఖని: సింగరేణి కార్మికులకు 11వ, వేజ్ బోర్డు ఏరియర్స్ సెప్టెంబర్‌లో చెల్లించే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం సింగరేణి ఆర్జీవన్ ఏరియా జీడీకే –11 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. బొగ్గు గని కార్మికుల పదకొండో వేజ్ బోర్డు ఒప్పందం ముగిసి మూడు నెలలు గడిచిందని, గత నెల నుంచి కొత్త జీతాలు చెల్లించినా కార్మికులకు 23 నెలల ఏరియర్స్ రావాల్సి ఉందన్నారు. కోల్ ఇండియా యాజమాన్యం అక్కడి యూనియన్లతో చేసిన ఒప్పందం ప్రకారం ఆగస్టు వేతనాలతో కలిపి సెప్టెంబర్ నెలలో ఏరియర్స్ చెల్లించేలా సర్క్యులర్ జారీ చేసిందన్నారు.యాజమాన్యం సాధించిన లాభాల్లో కార్మికుల 35శాతం చెల్లించాలన్నారు. ఆగస్టు 25 నుంచి 27 వరకు గోదావరిఖనిలో జరిగే యూనియన్ కేంద్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, అరెల్లి పోషం, మాదన మహేశ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.విశ్వనాథ్ కోరారు. శనివారం డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. అన్ని విభాగాల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. డిప్యూటేషన్ల పేరిట తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు ఆర్థిక లావాదేవీలకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జీడీకే–2ఏ మోరి వద్ద నుంచి విధులకు వెళ్లే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, గుండేటి మల్లేశ్, ప్రసాద్. సంపత్, ఉప్పులేటి మురళి, ఐలయ్య, బాలయ్య, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీతారామయ్య

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

రామగిరి: ఆర్జీ–3 ఏపీఏ ఏరియాల్లో తొమ్మిది మందిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్లు జీఎంలు సుధాకర్‌రావు, వేంకటేశ్వర్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని ఈ నెల 15న జీఎం కార్యాలయంలో సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

‘డాన్..డెన్’!

- ఇదీ లక్ష్మీరాజం హత్యకేసు నిందితుల తీరు..
- సెటిల్‌మెంట్లకు ప్రత్యేక ఇళ్లు
- అనుచరులంతా పాతికేళ్ల లోపువారే..

కోరుట్ల: ‘అంతా సినీ ఫక్కీలోనే ‘డాన్..డెన్’ సంస్కృతి కొట్టొచ్చినట్లు కనిపించే తీరు.. ఊరికి చివరగా ఉండే రెండు మూడు అంతస్తుల బంగ్లాల అడ్డాలు. ఈ బంగ్లాల్లో కింది అంతస్థులో విత్తనాల నాగరాజుకు సమాచారం.. మద్యం ఇతరత్రా మత్తు పదార్థాలు సరాఫరా చేసే యువకులు.. ఆ పైభాగంలో మరో ఇద్దరు ముగ్గురు యువకులు.. చివరి అంతస్తులో విత్తనాల నాగరాజు. ఇలా పట్టణంలో రెండు మూడు చోట్ల అడ్డాలు వేసిన నాగరాజు తన కార్యకలాపాల కోసం తరచూ అడ్డాలు మార్చేవాడని పోలీసులు విచారణలో తేలింది. ఇంత పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకున్నా నేరానికి పాల్పడిన నిందితులు పోలీసులకు చిక్కకతప్పలేదు.

అనుచరులు పాతికేళ్లలోపే..

పోగుల లక్ష్మీరాజం హత్య కేసులో పోలీసులు శుక్రవారం చూపిన నిందితుల్లో ఐదుగురు పాతికేళ్ల లోపు యువకులే. వీరిలో ఒకరికి కేవలం 18 ఏళ్లు మాత్రమే ఉండటం గమనార్హం. గంజాయి, మద్యం మత్తుకు బానిసగా మారిన వీరు అక్రమమార్గంలో డబ్బులు సంపాదించాలన్న ఆశతో సెటిల్‌మెంట్లు, బ్లాక్‌మెయిల్, బెదిరింపులు, డబ్బులు వసూళ్లకు దిగిన సంఘటనలు అనేకమున్నట్లు ప్రచారం. అయిలాపూర్ రోడ్డులో చివరగా ఉండే నాగరాజుకు చెందిన ఓ బంగ్లాలో కోరుట్లలో రైస్‌మిల్ నడిపే ఓ యువకుడిని, అతనికి మద్దతుగా వచ్చిన మరో యువకుడి నగ్న వీడియోలు తీసి చితకబాది మరీ రూ.10 లక్షల వరకు డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఇదే తరహాలో ముత్యాలవాడలో ఓ చిన్నపాటి జ్యోతిష్యుడిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

మళ్లీ కస్టడీకి..

పోగుల లక్ష్మీరాజం హత్యకేసులో అరెస్టు అయిన వారిలో కొందరిని పోలీసులు మళ్లీ కస్టడీలోకి తీసుకోనున్నట్లు సమాచారం. లక్ష్మీరాజం హత్య కాకుండా ఇంకా ఏ నేరాల్లో పాలు పంచుకున్నారన్న దానిపై పూర్తిస్థాయి విచారణకు పోలీసులు సిద్ధమవుతున్నారు. నాగరాజు కేవలం సంచలనం కోసమే హత్య చేశాడని పోలీసులు నిర్ధారించినా బంధువులు, కుటుంబ సభ్యులు మాత్రం ఇంకా ఏమైనా కారణాలతోనేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను మళ్లీ కస్టడీలోకి తీసుకున్న తర్వాత విచారణలో ఎలాంటి విషయాలు తెలుస్తాయోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.